## చోర సోదరులు..
## పల్సర్ వాహనం కనిపిస్తే..
# వదలరు

**బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న చోర సోదరుల అరెస్టు**

**రూ.8లక్షల విలువైన 17 వాహనాలు స్వాధీనం**



చోరీ వాహనాలను పరిశీలిస్తున్న మాదాపూర్ డిసిపి శిల్పావల్లి తదితరులు

గచ్చిబౌలి, డిసెంబరు 27 ప్రభాతవార్త : పల్సర్ బైక్ కనిపిస్తే చాలు.. ఈ సోదరులు చిటికెలో మాయం చేస్తారు.. లోన్ రికవరీ ఏజెంట్‌గా తనకు ఉన్న అవకాశాన్ని ఆసరాగా చేసుకొని ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడసాగారు. ఇద్దరు సోదరులు కలిసి గత ఏడాదిన్నర కాలంగా ఏకంగా 16 బజాజ్ పల్సర్ వాహనాలను, ఓ హోండా యాక్టివా వాహనాన్ని చోరీ చేశారు. చివరికి రాయదుర్గం పోలీసుల చేతికి చిక్కారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డిసిపి శిల్పావల్లి వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కోస్గి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన చాకలి నవీన్ (25), ఇతని సోదరుడు చాకలి ప్రవీణ్(22)లు నగరానికి వలస వచ్చి జగద్గిరిగుట్ట ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. నవీన్ బజాజ్ ఫైనాన్స్‌లో లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తుండగా, ప్రవీణ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా సులభంగా డబ్బు సంపాదించడం కోసం సోదరులు ఇద్దరు దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. లోన్ రికవరీ ఏజెంట్‌గా బజాజ్ వాహనాలు తీసుకొని లోను కట్టని వినియోగదారుల జాబితా నవీన్ వద్ద ఉండడంతో ఇద్దరు సోదరులు కలిసి చోరీకి పథకం వేశారు. ఇందులో భాగంగా లోన్లు కట్టని వారి వాహనాలను మారు తాళాలు, తాళాలు పగులగొట్టి చోరీ చేయసాగారు. పలువురు వినియోగదారులు చోరీ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మరికొందరు మాత్రం రికవరీ ఏజెంట్లు వాహనాన్ని తీసుకువెళ్లి ఉంటారని మౌనంగా ఉండిపోయారు. దీంతో ఇద్దరు సోదరులు కలిసి వరుస చోరీలకు పాల్పడుతూ గత ఏడాదిన్నర కాలంలో 16 బజాజ్ పల్సర్ వాహనాలను, ఓ హోండా యాక్టివా వాహనాన్ని చోరీ చేశారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, రాయదుర్గం, మాదాపూర్, చందానగర్, కెపిహెచ్‌బి, బాచుపల్లి తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహనాలను దొంగిలించారు. కాగా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస వాహనాల చోరీలు చోటు చేసుకోవడంతో పోలీసులు నిఘా పటిష్టం చేశారు. ఇందులో భాగంగా సోమవారం పక్కా పథకంతో నవీన్, ప్రవీణ్ సోదరులను రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన వాహనాలను జగద్గిరిగుట్ట, టోలిచౌకిలలో స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుల మీద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో అన్న నవీన్ మీద గతంలో సైతం ఒకేసు నమోదైందని పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో మాదాపూర్ ఏసిపి రఘునందన్‌రావు, రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ మహేశ్, డిఐ రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## బయో సైటిస్ వ్యాధితో సైకాలజీస్టుణిల అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మి నిప్పని మృతి



లక్ష్మి నిప్పన (ఫైల్ ఫొటో)

సైఫాబాద్, డిసెంబరు 27 ప్రభాతవార్త: తెలంగాణ సైకాలజీస్టుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి నిప్పని నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆమె బయో సైటిస్ వ్యాధితో కొద్ది రోజులుగా బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆమె మరణం పట్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్, రాష్ట్ర నాయకులు వెంపటి రాజు, సుధాకర్, డాక్టర్ మనోహరన్, అరుణ్‌కుమార్, శ్రీపూజ, శిల్పా, అనిత, కృష్ణసాహితి, దేదీప్య, షర్మిల కున్ను, అలియా పర్వీన్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ ఆమె అసోసియేషన్‌కు ఎనలేని సేవలు అందించారని, ఒక డైనమిక్ లీడర్‌గా అంకిత భావంతో పనిచేశారని, మానసిక రుగ్మతల నిర్మూలనకు ఆమె తనవంతు కృషి చేశారని, ఎంతో మందికి ఉచిత కౌన్సిలింగ్ ద్వారా సేవలు అందించారని గుర్తుచేశారు. సైకాలజీస్ట్ రంగానికి క్రియాశీలకంగా పనిచేస్తూ సేవలు అందించారని ఆమె సేవలు వెలకట్టలేనివని రాంచందర్ కొనియాడారు.

వేడుకల వేదికలపై దృష్టి.. న్యూఇయర్ వేడుకలను నిర్వహించే స్టార్ హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్ యజమాన్యాలకు,హైదరాబాద్ సైబరాబాద్, రాచకొండ పోలీసులు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే వేడుకలు జరిగే ప్రాంగణంలో పోలీసుల నిఘా ఉంటుంది తెలుపుతున్నారు. మరోపక్కగతంలో చికిత్స డ్రగ్స్ ముఠాలు వెల్లడించిన వివరాలు పోలీసులు సేకరించిన సమాచారం ప్రకారం కొన్ని పబ్స్‌లో డిజేలుకూడా ప్లెడ్లర్లుగా మారి వ్యవహారాలు నడిపిస్తున్నట్లు గుర్తించారు. వీరిపై నిఘా వేయడానికి మఫ్టీ బృందాలు విధుల్లో ఉంటాయి. వీటితో పాటు శాంతిభద్రత సమస్యలు రాకుండా చూసేందుకు క్యూఆర్‌టీం, ఈవ్‌టీజింగ్ కంట్రోలింగ్‌కు ప్రత్యేక బృందాలను మోహరిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము వరకు ఈబృందాలన్నీ పనిచేస్తుంటాయి. ఆయా కార్యక్రమాలు, వెన్యూల వద్ద ఉండే బౌన్సర్లు అతిగా ప్రవర్తించినా.. ఆహూతులకు ఇబ్బందులు కలిగించినా వారితోపాటు ఏర్పాటు చేసిన సంస్థలపైనా చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.



# హైదరాబాద్ వార్త

# హద్దు మీరొద్దంటూ ఆంక్షలు!

- న్యూఇయర్ వేడుకలపై డేగ కన్ను
- హంగామా సృష్టిస్తే కఠిన చర్యలు
- ఈవెంట్ల నిర్వాహకులకు అల్టిమేటం
- అనుమానిత పార్టీలపై మఫ్టీ నిఘా

## డ్రగ్స్, గంజా మాఫియాపైనా ఫోకస్



హైదరాబాద్, డిసెంబరు 27,ప్రభాతవార్త: న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో నగరవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుకోకుండా .మాదకద్రవ్యాల విక్రయం, వినియోగానికి చెక్‌పెట్టేందుక సిటీ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. కీలక ప్రాంతాల్లో ఆంక్షలు విధించాలని నిర్ణయించారు. సాధారణంగా సిటీలో పబ్స్ కపుల్ ఎంట్రీలను మాత్రమే అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో యువకులు పబ్‌వద్ద హాలచల్ చేసిన సందర్భాలు ఉన్నాయి. స్టాగ్‌గ్యాంగ్స్‌గా పిలిచే వీరు గతంలో చేసిన హంగామాలను బట్టి పోలీసులు ఓబ్లాక్ లిస్ట్ తయారు చేశారు. ఇలాంటి వారిపై కదలికలు, వ్యవహారలపై డేగాకన్ను వేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నారు. జోష్‌లో భాగంగా విచ్చలవిడిగా హారన్లు మోగిస్తూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేసే హాంకింగ్ గ్యాంగ్స్‌తోపాటు కార్లటాప్స్, బాయినెట్స్‌పై కూర్చుని హంగామా చేస్తూ ప్రయాణం చేస్తే వారిపై కటిన చర్యలు తీసుకోనున్నారు.అలాగే న్యూఇయర్ పార్టీల నేపథ్యంలో డ్రగ్స్ విక్రయం, వినియోగం పెరిగే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తూ (పెడ్లర్స్) అరెస్టయిన, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న వారిని కట్టడి చేయాలని నిర్ణయించారు. వీరందరినీ ముందస్తుగా అందుపులోకి తీసుకోవడం ద్వారా చెక్‌పెట్టేందుకు స్పెషల్‌టీమ్స్‌ను రంగంలోకి దింపారు.

## పుస్తక ప్రియులతో కళ కళలాడుతున్న కళా నిలయం

**సందడిగా కొనసాగుతున్న పుస్తక ప్రదర్శన ❒ తరలి వస్తున్న పిల్లలు, పెద్దలు, ప్రముఖులు**



పుస్తక ప్రదర్శనను సందర్శించిన మంత్రి కొప్పుల ఈశ్వర్, సుద్దాల అశోక్ తేజ

ధర్నాచౌక్, డిసెంబర్ 27, ప్రభాతవార్త: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కళా నిలయం (ఎన్టీఆర్ స్టేడియం) పుస్తక ప్రియులతో కళ కళ లాడుతోంది. ఈనెల 22 వ తేదీ ప్రారంభమైన 35 వ జాతీయ పుస్తక ప్రదర్శన పిల్లలు, పెద్దలు, ప్రముఖులతో సందడిగా కొనసాగుతోంది. పుస్తకాలకు విలువ తగ్గుతున్న ఈ రోజుల్లో ఇటువంటి పుస్తక ప్రదర్శనల ద్వారా పుస్తకాలను ప్రజలకు చేరువ చేయటం అభినందనీయమని పలువురు కొనియాడు తున్నారు. ఎంతో అట్టహాసంగా కొనసాగుతున్న ఈ పుస్తక ప్రదర్శనకు నిత్యం పిల్లలు, పెద్దలు, ప్రముఖులు తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మంగళవారం రాష్ట్ర సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశం, ఆర్‌టీఐ కమీషనర్ కట్ట శేఖర్ రెడ్డి, సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్, తదిత రులు పుస్తక ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల విద్యార్థులు రచించిన ఎనిమిది పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచయితలు అంటే ఎక్కడ నుంచో రారని, విద్యార్థులను ప్రోత్సహిస్తే మనలో నుండే కవులు, రచయితలు వస్తారని గురుకుల విద్యార్థులు నిరూపించారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా గురుకుల విద్యార్థులు రాణిస్తున్నారని, సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల నుండి యువ రచయితలు 17 పుస్తకాలు రాయటం ఒక విప్లవమని కొనియాడారు.

**ఇక్కడ ఉన్న పుస్తకాలు పోటీ పరీక్షలకు తయారవుతున్న అభ్యర్థులకు ఉపయోగ పడతాయి సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రవెంకటేశం**

హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను సందర్శించిన ఐఏఎస్ అధికారి బుర్రవెంకటేశం పుస్తక ప్రద ర్శనను ఉద్దేశించి మాట్లాడుతూ అంతర్జా తీయ బుక్ ఎగ్జిబిషన్ స్థాయికి హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ బుక్ ట్రస్ట్‌లో తెలంగాణ సమగ్ర చరిత్ర ఇంగ్లీష్‌లోకి తీసుకు వచ్చినం దుకు పబ్లిషర్స్‌ను అభినందించారు. ఇక్కడ ఉన్న పుస్త కాలు పోటీ పరీక్షలకు తయారవుతున్న అభ్యర్థుల కు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు.

**సుద్దాల అశోక్‌తేజ..** బుక్ ఫెయిర్‌ను సందర్శించిన సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ పుస్తకం ఒక జ్ఞాన కవచమని, పుస్తకం లేకుంటే తాను లేనని అన్నారు. శరీరానికి మలినం అయితే స్నానం చేస్తామని, అదే విధంగా హృద యాన్ని, మనసును శుభ్ర పరచాలం టే పుస్తకాలు చదవాలని అన్నారు.

**ప్రొఫెసర్ హరగోపాల్:** బుక్ ఫెయిర్ ను ఉద్దేసించి ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పుస్త కాలు అంటే కేవలం అక్షరాలు మాత్రమే కాదని, పుస్త కాలు అంటే ఒక విద్యుత్ వంటిదని, అది చైతన్య రథమని అన్నారు. ఎన్ని వేల పుస్తకాలు చదివినా ఇంకా చదవాలి అనిపిస్తుందని, ఇది ఒక తీరని కోరికలాగానే ఉంటుందని అన్నారు.్తక ప్రదర్శనను ఉద్దే శించి మాట్లాడుతూ అంతర్జాతీయ బుక్ ఎగ్జిబిషన్ స్థాయికి హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ బుక్ ట్రస్ట్ లో తెలంగాణ సమ గ్ర చరిత్ర ఇంగ్లీష్ లోకి తీసుకు వచ్చినందుకు పబ్లిషర్స్‌ను అభినందించారు.

**జీవితాన్ని ఆవిష్కరించిన సందేశాత్మక నాటకం**

## 'పాకుడురాళ్ళు' : డా. కె.వి.రమణాచారి



పాకుడురాళ్ళు నాటకంలో ఓ దృశ్యం

రవీంద్రభారతి, డిసెంబరు 27 ప్రభాతవార్త : ప్రఖ్యాత రచయిత డా. రావూరి భరద్వాజ 1978లో రచించిన, 2013లో జ్ఞానపీఠ పురస్కారం పొందిన పాకుడురాళ్ళు అనే నవలను నస్రీన్ ఇషాక్ నాటక రూపకల్పన, దర్శకత్వం వహించగా రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో నిభా థియేటర్ ఎన్సెంబుల్ సంస్థ నిర్వహణలో రూపొందిన ఈ నాటకం సినీపరిశ్రమలోని లోగుట్టులు, ప్రతిభను నిరూపించు కోవడానికి చేయాల్సిన పనులు, నిలదొక్కుకోవడానికి పడాల్సిన పాట్లు, ఎంతెత్తుకెదిగినా చిన్నతప్పుచేస్తే అధఃపాతాళానికి పడిపోతామన్న జీవితసత్యాన్ని సందేశాత్మక దృశ్యకావ్యంగా అద్భుతంగా మలిచిన ఆవిష్కరించిన నాటకం పాకులురాళ్ళు నాటకమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి వివరించారు. ప్రముఖపాత్రల్లో నటీనటులు భావన, భృగేష్, గౌరీ షా, సురంజిత్‌రెడ్డి, లావణ్య, మాధురి, ప్రియాంక, రాహు ల్, వికాస్ తదితరులు తమ అద్భుత నటనతో సినీపరిశ్రమలోకి అడుగుపెట్టే సన్నివేశాలతోపాటు పెట్టాక ఎదురయ్యే పరి స్థితులు, పరిణామాలను మనముందు సజీవంగా నిలిపారు.

## ముగిసిన సిబిఎస్ఈ నేషనల్ జిమ్నాస్టిక్స్ పోటీలు

**అండర్-17లో నిష్కా ప్రవీణ్ అగర్వాల్ మొదటిస్థానం**




గెలుపొందిన విజేతలతో గోపిచంద్, రమేష్, మోహన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త: సిబిఎస్ఈ నేషనల్ జిమ్నాస్టిక్స్ పోటీలు ముగిసాయి. గతనాలుగురోజులుగా జరుగుతున్న ఈపోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 700పాఠశాలల నుంచి 1700లకుపైగా విద్యార్థులు తమ ప్రదర్శన ఇచ్చారు. అండర్ 17 బాలికల విభాగంలో గాడియం విద్యార్థులు నిష్కా ప్రవీణ్ అగర్వాల్ మొదటిస్థానంలో నిలవగా.. 3వస్థానంలో నారాయణి అనే విద్యార్థి నిలిచింది. ఈసందర్భంగా జరిగిన ముగింపు వేడుకలకు గౌరవ అతిథిగా బాడ్మింట్ కోచ్ పద్మభూషణ్ అవార్డు గ్రహీత పుల్లెంల గోపిచంద్ ముఖ్యఅతిథులుగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ రమేష్,అరవిందోఫార్మా డైరెక్టర్ మోహన్‌రెడ్డిలు హాజరై విజేతలకు మెడల్స్, సర్టిఫికేట్స్ అందజేశారు. ఈసందర్భగా గోపీచంద్ మాట్లాడుతూ గెలుపోటములు ఆటలో ఒక భాగమని, ఇటువంటి పోటీలు అథ్లెట్లను తదుపరి పోటీలకు సిద్ధం చేసే మెట్లుగా అభివర్ణించారు. ప్రతిక్రీడాకారుడు కష్టపడితే తప్పక విజయం సాధిస్తారన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ కీర్తిరెడ్డి కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో మరో ముగ్గురు అస్వస్థత

**యాజమాన్య తీరును నిరసిస్తూ ఆందోళన చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు**



మారేడ్‌పల్లి కస్తూర్బా జూనియర్ కళాశాల ఆవరణలో అస్వస్థతకు గురైన అర్పిత, షబాన

కంటోన్మెంట్, డిసెంబర్ 27 ప్రభాత వార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్భాగాంధీ జూనియర్ కళాశాలలో గత నెల 18వ తేదీన విషవాయువు వ్యాపించడంతో 36 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కాగా అందులోని కొంత మంది విద్యార్థినీలను యశోధ, నిమ్స్ ఆసుపత్రులలో చికిత్స చేయించారు. వారిలో ఐదుగురు ఇంకా కోలుకోవడం లేదు. తుకారాంగేట్‌లో నివాసం ఉంటున్న పాక రామస్వామి కుమార్తె మేఘన పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో ఈ నెల 26వ తేదీన నిమ్స్ అసుపత్రిలో చేర్పించారు. అదే విధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అర్పిత, షేక్ షబానాలు కళాశాల ప్రాంగణంలోనే అపస్మారక స్థితిలో పడిపోయారు. వారిని వైద్య పరీక్షలు నిమిత్తం సమీపంలో ఉన్న గీతా నర్సింగ్ హోం అసుపత్రిలో చేర్పించారు. దీంతో ఆందోళనకు గురైన విద్యార్థినీల తల్లిదండ్రులు, విద్యార్థులు కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఇంటర్ విద్యార్థినీలు అస్వస్థతకు గురౌతున్నారని కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైకోర్టు అడ్వకేట్, ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అచ్చుత యాదవ్ ఆధ్వర్యంలో కళాశాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తాము అస్వస్థతకు గురైయ్యామని, ఇంత వరకు కోలుకోలేక పోతున్నామని, తమ భవిష్యత్తు దెబ్బతినే అవకాశాలునాన్నయని, తమకు జీవిత కాలం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కస్తూర్భాగాంధీ జూనియర్ కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. గత నెల 18వ తేదీన వ్యాపించిన విషవాయువు కళాశాల ప్రాంగణంలో నుంచే వ్యాపించిందని అందుకు కళాశాలనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తాము అస్వస్థతకు గురైతే కళాశాల యాజమాన్యం సక్రమంగా పట్టించుకోలేదన్నారు.

**విషవాయువుతో అస్వస్థతకు గురైన ఘటనపై విచారణ జరుపుతాం : శ్రీనివాస్ రావ్**

మారేడ్‌పల్లిలోని కస్తూర్భాగాంధీ కళాశాలలో వ్యాపించిన విషవాయువు ఘటనపై విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ శ్రీనివాస్ రావ్, మెంబర్ అపర్ణ, హైదరాబాద్ జిల్లా జడ్జీ మురళీ మోహన్, హైకోర్టు మెంబర్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డిలు తెలిపారు.

**కళాశాల ప్రాంగణం నుంచి విషవాయువు వ్యాపించలేదు : కార్యదర్శి**

విషవాయువు అస్వస్థతకు గురైన ఇంటర్ విద్యార్థినీలకు వైద్య సేవల ఖర్చులన్నీ కస్తూర్భాగాంధీ జూనియన్ కళాశాలయాజమాన్యం భరిస్తుందని కళాశాల కార్యదర్శి చక్రవర్తి,చైర్మన్ జానకిరామ్, కోశాధికారి వినేయ్‌కుమార్, వైస్ చైర్మన్ రమాదేవీ తెలిపారు.

## చలానాలకే పరిమితమా..? వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ..

బేగంబజార్, డిసెంబర్ 27 ప్రభాతవార్త: శాంతిభద్రతలను కాపాడే పోలీసులు కూడా ట్రాఫిక్ పోలీసు మాదిరిగా రహదారులపైకి వచ్చి వాహానాదారులను నానా యక్ష ప్రశ్నలు వేసి ట్రాఫిక్ చల్లానులు వేయడానికి పరిమితమయ్యారు. ఉదయం, సాయంత్ర వేళ్లలలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్,ఇద్దరు కానిస్టేబుల్స్, హోంగార్డులను రక్షక్ వాహనంలో వచ్చి ప్రధాన చౌరస్తాల వద్ద నిలుచ్చుని ట్రాఫిక్ పోలీసుల మాదిరిగానే ద్విచక్ర, త్రిచక్రవాహనాలను, గూడ్స్ ఆటోట్రాలీలను నిలిపి జరిమానాలను వేస్తున్నారు. నియమ నిబంధల పేరుతో ఎడాపెడా జరిమానాలు వడ్డిస్తున్నారు. లా అండ్ అర్డర్ పోలీసులు అనుమానం ఉన్న వాహానాలను మాత్రమే నిలిపి తనిఖీలు చేసిన తరువాత విడిచిపెట్టాలని కాని ఇదే అదనుగా భావించి లైసన్స్,ఆర్‌సి ఉందా.పోలుష్యన్ సర్టిఫికెట్ ఉందా అంటూ వాహానాదారులను నానా హైరానాకు గురిచేస్తున్నారు. వాహనదారునికి అందులో ఏ ఒక్కటి లేకున్న సరే అతనికి 150 రూపాయలనుంచి 200 వందల వరకు జరిమానాలు విధిస్తున్నారు. ఈస్ట్‌జోన్, వెస్టుజోన్ ,సెంట్రల్‌జోన్ పరుధులలోని పోలీస్ స్టేషన్‌లైన అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్ షాహినాయత్‌గంజ్, మంగళ్‌హాట్,కుల్సుంపురా, బేగంబజార్, అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలమేరకు ఉదయం, సాయంత్రం వేళ్లలో రక్షక్ వాహనంలో వచ్చి చౌరస్తాలను ఎంపిక చేసుకుని ట్రాఫిక్ పోలీసుల మాదిరిగానే వాహానాలను నిలిపి చలాన్లు వేస్తుంటారు. ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌కు చలాన్ల రూపంలో ఉదయం, సాయంత్రం వేళ్లలో వేసి అవరేజ్‌గా 500 వందల రూపాయలు వసూలు చేస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు సుమారుగా నెలకు లక్షపైగా చలాన్ల రూపంలో వసూలు చేస్తున్నారు. నగరంలో వాహానాలు నడుపులాంటేనే ముందుగా గుర్తు వచ్చేది లాఅండ్‌అర్డర్, ట్రాఫిక్ పోలీసులు ఇంటినుంచి పని నిమిత్తం బయటకు వెళ్లాలంటే ముందుగా డ్రైవింగ్ లైసన్స్, ఆర్‌సి,పోలుష్యన్ సర్టిపిక్టెట్ వెంట బెట్టుకుని వెళ్లాల్సిందే. లేకుంటే రెండు విభాగాలో ఎవరి ఒకరి చేతుల్లో పడితే అంతే సంగతులు సుమా పారాహుషార్.



# రజకులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి

### హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



డాక్టర్ అంజయ్య విగ్రహ ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న బండారు దత్తాత్రేయ

ధర్నాచౌక్, డిసెంబర్ 27, ప్రభాతవార్త: రజకాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మందలపు అంజయ్య స్ఫూర్తితో రజకులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మంగళవారం కవాడిగూడలోని సాయిబాబా దేవాలయంలో డాక్టర్ అంజయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సంస్మరణ సభనుద్దేసించి దత్తాత్రేయ మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అంజయ్య అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రజకులు విద్య, రాజకీయ, ఉపాధి రంగాలలో అభివృద్ధి సాధించటమే అంజయ్యకు నిజమైన నివాళి అని అన్నారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు అంజయ్య రజకుల సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించానని తెలిపారు. డాక్టర్ కే.లక్ష్మణ్ మాట్లాడుతూ రజకుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి అంజయ్య సేవలు మరువలేనివని కొనియాడారు. అంజయ్య కేవలం రజకుల కోసమే కాకుండా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహారాజ్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, సాయిబాబా దేవాలయ కమిటీ ఛైర్మన్ మందలపు గాంధీ, హైకోర్టు న్యాయవాది వినయ్‌కుమార్, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఏ.ఎల్.మల్లయ్య, అఖిల భారత రజకాభివృద్ధి సంస్థ జాతీయ అధ్యక్షులు పొన్నాడ మోహన్‌రావు, ఉపాధ్యక్షులు ఎం.నర్సింహ, పార్వతి, ప్రధాన కార్యదర్శులు కమ్మన్న, జూపల్లి రాజశేఖర్, కార్యదర్శులు రాజేశ్వరి, సత్యనారాయణ, శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ బొమ్మరాజు కృష్ణమూర్తి, గ్రేటర్ ప్రధాన కార్యదర్శులు బి.చంద్రమోహన్, ఎన్.రాజు, కిషన్, సుధాకర్, స్థానిక అధ్యక్షులు సాయి సత్యనారాయణ, బీజేపీ నాయకులు రమేష్‌రాం, పరిమళకుమార్, సి.కే.శంకర్‌రావు, మహేందర్‌బాబు, వెంకటేష్, సలంద్రి శ్రీనివాసయాదవ్, కేశవ్ పాల్గొన్నారు.

# జాతి గర్వించదగ్గ క్రీడాకారులుగా తీర్చిదిద్దటమే తెలంగాణ లక్ష్యం

### ఎంఎల్‌సి శంభీపూర్ రాజు



ట్రస్మా స్పోర్ట్‌మీట్2022కు హాజరైన ఎంఎల్‌సి శంభీపూర్ రాజును మెమెంటోతో సత్కరిస్తున్న ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరియాదగరి శేఖర్‌రావు, జిల్లా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారులు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, వనజాఅశోక్, ప్రవీన్,నందిని, ఛాయ, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, పరుషరామ్

కుత్బుల్లాపూర్, డిసెంబరు 27 ప్రభాతవార్త : క్రీడలలో ఉత్తమ శిక్షణిచ్చి జాతి గర్వించదగ్గ క్రీడాకారులుగా తీర్చిదిద్ది తెలగాణకు ఖ్యాతి తెచ్చిపెట్టాలని రంగారెడ్డిజిల్లా ఎంఎల్‌సి శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్ లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్‌మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పోర్ట్స్‌మీట్2022ను ఆయన రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, శివరాత్రి యాదగిరిలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు వనజాఅశోక్, గండిమైసమ్మ మండల అధ్యక్షులు పవీన్ కార్యవర్గాలతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులకు బాల్యదశనుండే క్రీడలపట్ల ప్రత్యేక ఆసక్తి కనబర్చటంద్వారా శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. అంతకుముందు కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పోర్ట్స్‌మీట్2022ను ప్రతియేడూ విధిగా నిర్వహించడానికి పాఠశాలలు ముందకురావాలని సూచించారు. తెలంగాణ రికగ్నైజ్డ్‌సూకల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించటంలో నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ రంగారెడ్డిజిల్లా ట్రస్మా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సహించాటనే లక్ష్యంతో స్పోర్ట్స్‌మీట్‌ను ప్రతిస్టాత్మకంగా ప్రారంభించి ప్రభుత్వం నుండి మరింత బాధ్యతాయుతమైన గుర్తింపును పొందిదన్నారు. అంతర్జాతీయ వెటరన్ క్రీడాకరులు మర్రి లక్ష్మన్‌రెడ్డి మాట్లాడుతూ బాల్యదశనుండే క్రీడలు, శారీరక అభ్యున్నతిలో దోహదపడతాయని సూచాఇంచారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్‌మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు వనజాఅశోక్, కార్యదరి శ్రీనివాసచారి, కోశాధికారి నర్సిరెడ్డి, గండిమైసమ్మ మండల అధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి నందిని, ఉపాధ్యక్షురాలు ఛాయ, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, పరుశరామ్, కార్పొరేటర్లు రావుల శేషగిరిరావు, కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, మహ్మద్ రఫీ, నాయకులు ఏర్వ శంకరయ్య, విజయరామిరెడ్డి, కస్తూరి బాల్‌రాజ్, ఏర్వ సాయికిరణ్(బంటి) తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బాలాజీ మందిరం కమిటి ప్రతినిధులు

చార్మినార్, డిసెంబరు 27 ప్రభాతవార్త : చార్మినార్ సమీపంలోని చౌక్ మైదాన్ ఖాన్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జనవరి నెల రెండవ తేదీ నుంచి 16వ తేదీ వరకు అత్యంత వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు మందిరం ప్రధాన పూజారి శృంగారం రమణా చార్యులు,పూజారి శృంగారం ఆత్రేయ చార్యులు తెలిపారు.మందింరలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.శ్రీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా 2వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి నేత్ర దర్శనం,6.30 గంటలకు స్వామి వారి వైకుంఠ దర్శనం,పల్లకి ఊరేగింపు,4వ తేదీ బుధవారం నమ్మాళ్ వార్ పరమ పద మహోత్సవం,14వ తేదీన శ్రీ గోదాదేవి కళ్యాణం,16వ తేదీన కరినోము తదితర కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలియజేశారు. కళ్యాణం,వైకుంఠ మహోత్సవాలలో పాల్గొన దలచిన భక్తులు ఆలయ అర్చకులను సంప్రదించాలని వారు కోరారు.ఈ విలేకర్ల సమావేశంలో వెంకటేశ్వర స్వామి మందిరం కమిటి ప్రతినిధులు శృంగారం రమణా చార్యులు,శృంగారం ఆత్రేయ చార్యులు,గోవింద చార్యులు,రాధేశ్యాం అగర్వాల్, రాధేశ్యాం మండోతియా,శ్రీనివాస్ బన్సల్,రాజేంద్ర కుమార్ పిత్తి, ప్యారసాని వెంకటేష్,అనిల్ బజాజ్,సత్యనారాయణ అగర్వాల్, గోపాల్ వ్యాస్,మనీషా రాణాతో పాటు పలువురు పాల్గొన్నారు.

# శానిటేషన్ స్వీపర్‌కు ఘన నివాళులు అర్పించిన సిబ్బంది



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో శానిటేషన్ స్వీపర్‌గా పని చేసి చనిపోయిన సునీత మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సిబ్బంది దృశ్యం

నార్సింగి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో శానిటేషన్ కార్మికురాలిగా పని చేస్తున్న సునీత సోమవారం రాత్రి అకస్మాత్తుగా చనిపోయింది. మంగళవారం కార్పోరేషన్ కార్పోరేటర్ నిఖిలా సంగారెడ్డి, అధికారులు, కార్మికులు సునీత ఇంటికి వెళ్లి ఆమె మృతదేహంపై పుష్పగుచ్చాలుంచి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సునీత కుటుంబ సభ్యులకు అంత్యక్రియల కోసం రూ.10.వేలు అందజేశారు. అప్పగించిన పనిని త్వరగా, బాధ్యతగా పూర్తి చేసే సునీత మృతి తమను కలిచి వేసిందని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, తోటి శానిటరీ కార్మికులు బాధపడ్డారు. ఆమెకు ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. నివాళులు అర్పించిన వారిలో శానటరీ జవాన్లు యాదగిరి, సురేష్, మల్లేష్, వెంకటేష్, కృష్ణ, నరేందర్, రాము, యుగేందర్ తదితరులు ఉన్నారు.

## బస్తీ సమస్యల పరిష్కారానికి సంఘాలు కృషి చేయాలి

### మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్

చిక్కడపల్లి, డిసెంబరు 27 ప్రభాతవార్త: బస్తీల సంఘాలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ఎంపి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్‌యాదవ్ అన్నారు. రామ్‌నగర్ డివిజన్ నాగమయ్యకుంట బస్తీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సాయిలును అంజన్‌కుమార్‌యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాశం అనీల్‌యాదవ్, ముషీరాబాద్ బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజియాదవ్, నాగమయ్యకుంట బస్తీ నాయకులు లక్ష్మణ్, విడి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనీల్‌కుమార్‌యాదవ్‌నుకలిశారు.

# చిత్రపురి కాలనీలో చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం



మణికొండ చిత్రపురి కాలనీలో చిన్న పిల్లల పార్కును ప్రారంభిస్తున్న కౌన్సిలర్ డాక్టర్ వసంత్ చౌహాన్

నార్సింగి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీ ఎల్‌ఐజీలో మంగళవారం కౌన్సిలర్‌లు డాక్టర్ వసంత్ రావ్ చౌహాన్, హైమాంజలిలు ప్రారంభించారు. ఈ సంరద్భంగా వారు మాట్లాడుతూ ఎదిగే వయసులో ఉన్న చిన్నారులు నిత్యం ఆటలు ఆడితే వారిలో శారీరక, మానసిక ఎదుగుదల చాలా బాగా ఉంటుందన్నారు. వేగంగా పట్టణీకరణ అవుతున్న మణికొండ వంటి ప్రాంతంలో ప్రభుత్వ క్రీడా మైదానాలు, పార్కులు జనాభా దామాషా ప్రకారం తక్కువగా ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ నిధులతో చిత్రపురి కాలనీలో చిన్నారులు ఆడుకునేందుకు అన్ని రకాల క్రీడా వస్తువులు ఏర్పాటు చేయించి ప్రారంభించామని వివరించారు. చిన్నారులు నిత్యం ఈ పార్కులోకి వచ్చి ఆటలు ఆడుకొని, క్రీడా సామాగ్రితో వ్యాయామాలు కూడా ఉచితంగా చేసుకోవచ్చని తెలిపారు. పట్టణాలలోని చాలా పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవని, దీంతో విద్యార్థులలో శారీరక ఎదుగుదల సవ్యంగా ఉండడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రపురి సొసైటీ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రతినిధులు దొర, పద్మజ, అనిత, రాజు, రమణ, బాలాజీ, గంగాధర్ శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ స్పీకర్ నివాసంలో ఘనంగా అయ్యప్పపడిపూజ

అడ్డగుట్ట,డిసెంబర్ 28 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మోండా మారెట్‌లోని టకారా బస్తీలో డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ అధ్వర్యంలో సోమవారం రాత్రి అయ్యప్పపడిపూజ అత్యంత వైభవంగా జరి గింది. విభిన్న రీతిలో ప్రత్యే క అలంకరణలతో తీర్చిదిద్దిన ప్రాంగణంలో చూపరులను కనువిందు చేసింది. ఈ పడిపూజలో పద్మారావు గౌడ్ కుమారులు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్రతో పాటు సికింద్రాబాద్ సనత్ నగర్, కంటోన్మెంట్, మల్కాజిగిరి, ముషీరాబాద్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి అయ్యప్పపడిపూజలో పాల్గొన్నారు.

## నాలా పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, డిసెంబరు 27 ప్రభాతవార్త: అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని పద్మాకాలనీలో నాలా పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ డివిజన్ కార్యదర్శి సురేందర్, నేతలు కొండపల్లి మాధవ్, మనోహర్‌సింగ్, నాగులు, జిహెచ్‌ఎంసి ఈఈ శ్రీనివాస్, డిఈ సన్నీ, జలమండలి డీజీఎం దిలీప్‌కుమార్, మేనేజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిధారులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి తలసాని



మెరుగైన వైద్యం కోసం ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 27 ప్రభాతవార్త: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బండ మైసమ్మ నగర్‌కు చెందిన మానస గుండె జబ్బుతో బాధపడుతుంది. కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైనవైద్యం చేసుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 2.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ నాయకులు కురుమ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి శ్రీవారి ఆహ్వాన పత్రిక అందజేత

చిక్కడపల్లి, డిసెంబరు 27 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 2023 జనవరి 2న నిర్వహించతలపెట్టిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయం ఈఓ కె.రామాంజనేయులు వివరించారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనీల్‌కుమార్, ముషీరాబాద్ ఎమ్మెల్యేముఠా గోపాల్‌ను కలిసి ఆహ్వానపత్రాలను అందించారు. ఈ ఏడు లక్ష మంది వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఈవో వివరించారు.

## ఒయూ క్యాంపు బస్తీవాసులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలి



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, శోభన్‌రెడ్డి

తార్నాక, డిసెంబర్ 27 ప్రభాతవార్త: ఏండ్ల నుంచి చిన్న చిన్న ఇండ్లల్లో ఉంటున్న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపు బస్తీవాసులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని మంగళవారం మంత్రి కేటీఆర్‌కు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. ఓ.యూలో ఉండే 9 బస్తీవాసులు తెలంగాణ ఉద్యమంలో సైతం పాల్గొన్నారని మంత్రికి గుర్తు చేశారు. ప్రస్తుతం ఇక్కడ దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అందుకోసం ఇక్కడ నివసిస్తున్న ప్రతి ఒక్క కుటుంబానికి ఇండ్లు కేటాయించాలని వారు మంత్రిని వారు కోరారు. అనంతరం వారు మంత్రి కేటీఆర్‌ను ఘనంగా సన్మానించారు.

## ఏఐఎఫ్‌బి సనత్‌నగర్ నియోజకవర్గం కన్వీనర్‌గా కొమ్మూరి వెంకటేష్ యాదవ్



వెంకటేష్‌యాదవ్‌ను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్

హైదరాబాద్, డిసెంబరు 27,ప్రభాతవార్త: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) సనత్‌నగర్ నియోజకవర్గం కన్వీనర్‌గా కొమ్మూరి వెంకటేష్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు పంజాగుట్టలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌వి ఆర్‌వి ప్రసాద్ నియామకపత్రం అందజేసి అభినందించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 23నుంచి 26వరకు జరిగే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 19వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మహాసభల బాధ్యతలను పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ,హైదరాబాద్ ఇంచార్జ్ రాములుయాదవ్, హైదరాబాద్ కన్వీనర్ సయ్యద్ తౌఫిక్ అలీ, సనత్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి వెంకటేష్ యాదవ్‌కు అప్పగించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆవుల శ్రీకాంత్, ఎస్.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# అందె శ్రీనివాస్ మృతికి బిఆర్‌ఎస్‌కు తీరనిలోటు : ఎమ్మెల్యే సాయన్న



తెలంగాణ ఉద్యమ నేత అందె శ్రీను బౌతికాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 27 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమ నేత అందె శ్రీనివాస్ మృతి చెందడం పట్ల కంటోన్మెంట్‌లో బిఆర్‌ఎస్‌కు తీరనిలోటు ఏర్పడిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. 8వ వార్డు బొల్లారం ఆదర్శ నగర్‌లో నివాసం ఉంటున్న తెలంగాణ ఉద్యమ కారుడు అందె శ్రీనివాస్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలియగానే కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న, మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జైరాజ్, మాజీ బోర్డు సభ్యుడు లోకనాథం, టిఆర్‌ఎస్ నేతలు పనస సంతోష్, భాస్కర్ ముదిరాజ్, ప్రభుగుప్త, సనాధి శ్రీనివాస్, తేజ్‌పాల్‌లు పాల్గొని ఆయన బౌతికాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

### అందె శ్రీను ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎర్రోళ్ల శ్రీనివాస్

తెలంగాణ ఉద్యమ నేత అందె శ్రీను ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన మరణం కంటోన్మెంట్‌కు తీరనిలోటు ఏర్పడిందని తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ ఛైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. బొల్లారం ప్రాంతానికి చెందిన అందె శ్రీను గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. అయన మరణ వార్త తెలియగానే ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆయన నివాసానికి వచ్చి బౌతికాయంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు.

# కాముని చెరువు కబ్జా..? అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 27, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కామునిచెరువుకు ఆనుకుని ఉన్న రాఘవేంద్ర సొసైటీ వద్ద కొంతమంది అక్రమంగా మట్టి పోసి కబ్జా చేసిన విధానంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగంగా చెరువును పూడ్చి వేసి నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నా.. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని వారిని తప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంకటే ఎవరైతే చెరువు కబ్జాకి పూనుకున్నారో వారిని అరెస్ట్ చేసి మట్టి తీసే విధంగా చర్యలు తీసుకునేటట్లు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ చెరువు సుందరీకరణకు తాను మంత్రి కెటిఆర్ దగ్గర నిధులు కేటాయించి ఎంతో అభివృద్ధి చేద్దామనుకుంటే ఈ విధంగా కబ్జా చేయడం దారుణమని అన్నారు. దీనికి పూనుకున్న వాళ్ళని ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తేలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో పాటు బాలానగర్ ఎమ్మార్వో, కూకట్‌పల్లి సీఐ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ కోసం భవన నిర్మాణం చేయిస్తా



సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేతిసుభాష్‌రెడ్డి

నాచారం, డిసెంబర్ 27 ప్రభాతవార్త: మల్లాపూర్ సినియర్ సిటీజన్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆద్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ ను మంగళవారం మల్లాపూర్ ఎస్ఎల్ఎన్ హాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతిసుభాష్‌రెడ్డి ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్స్ కోసం మల్లాపూర్‌లో భవన నిర్మాణానికి స్థలం ఉంటే తన నిధులతో భవనం నిర్మాణం చేయిస్తానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జె.ప్రభుదాస్, తహసిల్దార్ గౌతమ్‌కుమార్, ఆసరా రాష్ట్ర నాయకులు జి.నాగేశ్వర్‌రావు, సీనియర్ పాత్రికేయులు,గోకుల్‌నగర్ రెసిడెన్సీయల్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు మల్కయ్య, సీనియర్ సిటీజన్ సంక్షేమ సంఘం మల్లాపూర్ అద్యక్షులు పి.ఎన్.స్వామి, సభాధ్యక్షులు ఎ.సుధర్శన్, ప్రధాన కార్యదర్శి ఐ.సాంబశివరావు, చేపూరి సుదర్శన్, చేపూరి అరుణతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కొవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, డిసెంబరు 27,ప్రభాతవార్త : చైనా ఇతర దేశాలల్లో ఏర్పడిన కొవిడ్ వేవ్‌లు భారతదేశంలోనూ ప్రజలను కొవిడ్‌పట్ల భయాందోళనలకు గురిచేస్తుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే భారత ప్రభుత్వం ఇంటి నుంచి బయటకు వెళ్లే వారు కొవిడ్ జాగ్రత్తలు పాటించాలని సూచించింది. అలాగే పరిశ్రమలు, వాణిజ్యసంస్థలు ముఖ్యంగా హాస్పత్రుల్లో తీసుకోవాలన్సిన జాగ్రత్తలపై మార్గదర్శకాలు విడుదల చేసింది.ఈసందర్భంగా బంజారాహిల్స్‌లోని విరించి వైద్యులు తమ సిబ్బందితో కలిసి కొవిడ్ మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. కొవిడ్ జాగ్రత్తలపై సెక్యూరిటీ, హౌజ్‌కీపింగ్, నర్సింగ్, పారామెడకిల్, ఇతర విధుల్లో ఉన్నవారికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మెడికల్ డైరెక్టర్ డా.శ్రీనివాస్ సామవేదం, డైరెక్టర్ డా.శ్యాంసుందర్‌లు మాట్లాడుతూ హాస్పత్రుల్లో పనిచేసే సిబ్బంది కొవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖచ్చితంగా మాస్కులు ధరించాలని స్పష్టం చేశారు. అలాగే పేషెంట్లు, వారి సంబంధికులు మాస్కులు ధరించడమే కాకుండా సోషల్ డిస్టెన్స్ పాటించాలని సూచించారు. వాక్సిన్‌లు తీసుకోని వారు ఉంటే వెంటనే వ్యాక్సిన్లు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

# మైనార్టీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం



హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరిన మైనార్టీలు

చార్మినార్, డిసెంబరు 27 ప్రభాత వార్త : మైనార్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. చార్మినార్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ఆధ్వర్యంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లకు చెందిన మహ్మద్ సిద్ధిఖీ,మహ్మద్ యూసుఫ్ జోయ,మహ్మద్ సిరాజ్‌లతో పాటు పలువురు మంగళవారం హోంశాఖ మంత్రి మహమూద్ అలీ సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్‌లోధీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమం పథకాలు పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు.బిఆర్‌ఎస్ నాయకులు మహ్మద్ హామేర్,దాస్‌లు పాల్గొన్నారు.

# ప్రేమ విఫలమై ఒరిస్సా వాసి బలవన్మరణం

తార్నాక, డిసెంబర్ 27 ప్రభాతవార్త: ప్రేమ విఫలమైందని తీవ్రంగా కలత చెందిన వ్యక్తి ఉస్మానియా యూనివర్సిటీ చెట్లపొదల్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇన్స్‌పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ కథనం ప్రకారం. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుశాంత్ జేనా(28) గత కొన్ని నెలలుగా హబ్సిగూడలోని కినేరా గ్రాండ్ హోటల్లో పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా ఇతను ఓ అమ్మాయిని ప్రేమి స్తున్నాడు. ఇటీవల వీరి ప్రేమ విఫలం అవ్వడంతో తీవ్ర మనోవేదనకు గురౌతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఒయూ అంగడి బస్తీ ప్రాంతంలోని నిర్మానుషంగా ఉన్న చోట ఓ చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దింపారు. అనంతరం మృతుడి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.



# గాంధీ ఆసుపత్రిలో 'కొవిడ్ మాక్‌డ్రిల్'

### ఆస్పత్రిలో పడకలు, ఆక్సిజన్ సౌకర్యాలను పరిశీలించిన అధికారులు



కేంద్రం సూచనల మేరకు దేశవ్యాప్తంగా కోవిడ్ ఆసుపత్రుల్లో మాక్‌డ్రిల్‌లు నిర్వహిస్తున్నారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. గాంధీ ఆసుపత్రిలో వసతులు, సదుపాయాలను పరిశీలించారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని.. ఆస్పత్రిలో పడకలు, ఆక్సిజన్ లభ్యత సరిపడా ఉందని అధికారులు తెలిపారు. అవసరమైన వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని అధికారులు స్పష్టం చేశారు.

## మిషన్ భగీరథ దేశానికి ఆదర్శం : ఎమ్మెల్యే మంచిరెడ్డి


వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి

**తుర్కయంజాల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త :** మిషన్ భగీరథ పథకం దేశానికిఆదర్శంగా నిలిచిందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ సుమారు 25 లక్షల లీటర్ల నీటిసామర్థ్యంతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి నల్ల ద్వారా సురక్షితంగా తాగునీరు అందించాలనే ప్రధాన ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 100% గృహాలకు సురక్షిత త్రాగునీరు అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమే అన్నారు. మిషన్ భగీరథపథకం అమలు తీరుపై ఇప్పటికీ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకు పనులను పూర్తిచేసి ప్రజలకు మంచినీరు అందించాలని ఆయన అధికారులతో ఆదేశించారు. అనంతరం ఆయన కమ్మగూడలోని రాజరజిత ప్రేమ్ హోమ్స్ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లో భాగంగా చేపడుతున్న మంచినీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ పీసీసీ సభ్యులు కౌన్సిలర్ కాకుమాను సునీల్, కమిషనర్ ఎన్ఆర్ జ్యోతి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్లు కోసికే ఐలయ్య, టిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రామవత్ కళ్యాణ్ నాయక్, బిజెపి పార్టీ ఫ్లోర్ లీడర్ కదారి శ్రీలత అనిల్, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్తకుర్మా మంగమ్మశివకుమార్, మున్సిపాలిటీ టిఆర్ఎస్ అధ్యక్షుడు అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అశ్విని, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు,

## పేదలకు భారంగా మారిన ఇంటి పన్నులు : చల్లా నర్సింహారెడ్డి


ధర్నాలో ప్రసంగిస్తున్న చల్లా నర్సింహారెడ్డి: పక్కన దేప తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీఅధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజలపై పన్నుల బాదుడును నిరసిస్తూ మంగళవారం మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో భారీ ఎత్తున నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో ఎక్కడా లేని విధంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు భారీగా ఉండడం వల్ల వాటిని చెల్లించలేక నిరుపేద, పేద, దిగువ, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. 200 శాతం పెరిగిన పన్నులతో ప్రజలు బెంబేలెత్తున్నారనీ అధికారులు తక్షణమే స్పందించి పన్నులుతగ్గించాలని సూచించారు.

**ప్రజలకు అండగా కాంగ్రెస్: దేప భాస్కర్‌రెడ్డి...** పన్నుల భారంతో సతమతమవుతున్న పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ఉంటుందని టిపిసిసి మెంబర్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో విపరీతంగా పెరిగిన ఇంటి పన్నులు ప్రజలకు గుదిబండగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పన్నులను తగ్గించే వరకు కాంగ్రెస్ పోరాటాలు చేస్తుందని భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, భాగ్యనగర్ సొసైటీ వైస్ చైర్మన్ బంగారు బాబు, మీర్‌పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు చల్లా కవితా బాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, డిసిసి ఉపాధ్యక్షుడు ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, మల్లెల విజయభాస్కర్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, ఐతరాజు భాస్కర్, సురేందర్‌రెడ్డి, గెల్ల సుభాష్‌రెడ్డి, గంగమ్మ, ఎర్రబెల్లి అరుణ, పద్మశ్రీలతో పాటు పెద్దబావి వెంకట్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణ, అమృతానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు సమస్యకు పరిష్కారం


వరద నీటి పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న బన్నాల ప్రవీణ్

**ఉప్పల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లోని ఎన్జీఆర్ఐ నుంచి సీతారామకాలనీ మీదుగా రాఘవేంద్ర నగర్‌కాలనీ వరకు చేపడుతున్న వరద నీటి కాలువ పనులు త్వరగాపూర్తి చేయాలని బిఆర్ఎస్‌నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులతో కలిసి వరద నీటి కాలువ పనులను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్జీఆర్ఐ నుంచి వస్తున్న వరద నీటిని మళ్లించేందుకు ప్రత్యేకంగా రూ.కోటి 20లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్, వర్క్ ఇన్ స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ నేతలు బజారు జగన్‌గౌడ్,కొండల్‌రెడ్డి, కె.జగన్,మహమూద్, శ్రీను, కాలనీ సంఘం నేతలు రమేష్‌గౌడ్, రామానుజం, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.జగన్ తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా పద్మా రాముగుప్త


పద్మ రాముగుప్తను సన్మానిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ఆర్యవైశ్య సంఘం సరూర్‌నగర్ మండల అధ్యక్షునిగా పద్మ రాముగుప్త ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం గుప్తా ఆధ్వర్యంలో సరూర్ నగర్ మండలంలోని బస్తీ సంఘాల అధ్యక్షుల సమక్షంలో పద్మ రాముగుప్తాని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావది లక్ష్మీ నారాయణ, పొలిటికల్ కమిటీ చైర్మన్ చింతల రవికుమార్ గుప్తా, రంగారెడ్డి జిల్లా కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాముగుప్త మాట్లాడుతూ మండలంలోని అన్ని బస్తి సంఘాల సభ్యులకు అందుబాటులో ఉంటానని ఆర్యవైశ్య సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు.

## చర్చిల అభివృద్ధికి కృషి : బలాల


ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న పాస్టర్ ప్రభుచరణ్

**మలక్‌పేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని చర్చిల అభివృద్ధికి కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారాంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, పాస్టర్ ప్రభుచరణ్ ఆధ్వర్యంలో చర్చిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. చర్చిలో ఉన్న వాటర్ కనెక్షన్‌ను కమర్షియల్ కనెక్షన్‌గా నమోదు చేసి బిల్లు వసూలు చేస్తున్నారని, రూ. 96వేల బిల్లు వచ్చిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత జల మండలి అధికారులతో మాట్లాడి డొమెస్టిక్ కనెక్షన్‌గా మార్చి బిల్లును రద్దు చేయాలని ఆదేశించారు. చర్చిలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు చెప్పగా ఫ్లోరింగ్‌కు నిధులు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమస్యల పరిష్కారంకోసం వెంటనే ఎమ్మెల్యే బలాల స్పందించడంతో పాస్టర్ ప్రభుచరణ్ ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా అయ్యప్ప పల్లకి ఊరేగింపు


అయ్యప్ప స్వామి పల్లకి ఊరేగింపును నిర్వహిస్తున్న దృశ్యం

**మలక్‌పేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త :** ఓల్డ్ మలక్‌పేట మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలోని అయ్యప్పస్వామి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. పల్లకిసేవ ఊరేగింపుకార్యక్రమం శ్రీ పోచమ్మ దేవాలయంవద్దకు రాగానే డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, నరేందర్‌ముదిరాజ్, హరిగౌడ్, చీపురు రాజాగౌడ్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు కనకబోయిన రాజు, అయ్యప్ప ఆలయ చైర్మన్ బత్తుల రాముయాదవ్ తదితరులు పల్లకి ఊరేగింపు కార్యక్రమానికి ఘనంగా స్వాగతం పలికారు. అదే విధంగా వందలాది మంది భక్తులు పల్లకి ఊరేగింపు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై అనవసర విమర్శలు మానుకోవాలి: ముడుపు రాజిరెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మీద అనసర ఆరోపణలకు దిగుతున్నారని చంపాపేట డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి అన్నారు. ఎల్లవేళలా ప్రజల్లో ఉంటూ కోట్లాది రూపాయలతో నియోజకర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేపై చౌకబారు ఆరోపణలు చేయడం మానుకుని, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి తన డివిజన్‌లో ఇప్పటి వరకు ఎన్ని కోట్లతో అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కేవలం ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్, బిజెపి కార్పొరేటర్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా సుందరమైన ముక్తిఘాట్‌ను నిర్మించిన ఎమ్మెల్యే, దానిని చూడమని చెబితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి అనేది కేవలం ఓట్ల కోసం చేసేది కాదని, ముక్తిఘాట్‌ను చూస్తేనే ఈ విషయం తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## అల్మాస్‌గూడ చెరువులను కాపాడాలి: రామిడి శూరకర్ణారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో కబ్జాకు గురవుతున్న చెరువులను కాపాడాలని తెలంగాణ రాష్ట్ర బిజెవైఎం కార్యవర్గ సభ్యుడు రామిడి శూరకర్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదేవిధంగా బాలాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్మాస్‌గూడలోని సర్వేనెంబర్ 134, 145, 136లలో ఉన్న కోమటి కుంట చెరువు, సర్వే నెంబర్ 85, 86/1లో ఉన్న ఎర్రకుంట చెరువుకు సంబంధించి కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలు కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో చెరువు స్థలాల్లో ఇళ్ళు, ప్రహరీ గోడలు వెలుస్తున్నాయనీ అంతేకాకుండా సుందరీకరణ పేరుతో చెరువులను కుదిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వెంటనే విచారణ జరిపి కబ్జాదారులపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలని శూరకర్ణారెడ్డి కోరారు.

## మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : లాయఖ్ అలీ

**మలక్‌పేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త :** మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదరి లాయఖ్ అలీ పేర్కొన్నారు. మైనార్టీ కార్పొరేషన్‌కు రూ. 70 కోట్లు అదనంగా కేటాయించడం అభినందనీయమని, సిఎంకెసిఆర్, హోంమంత్రి మహమూద్ అలీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమంకోసం సిఎం కెసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.

## లాభాపేక్ష లేకుండా సేవ చేయడం అభినందనీయం : మంత్రి


మంత్రి జగదీశ్వర్‌రెడ్డి నటుడు సుమన్‌కు క్రీడా సామాగ్రి అందజేస్తున్న విజయరంగ

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఇతరులకు సేవ చేయడం అభినందనీయమని మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ప్రముఖ సినీ నటుడు సుమన్, ఎంపీ మద్ది రవిచంద్ర పేర్కొన్నారు. బిర్లా ప్లానిటోరియంలో శ్రోయోబిలాషి బ్రోచర్ ఆవిష్కరణ, 33 మండలాలకు క్రీడా సామాగ్రిని ఫౌండర్ చైర్మన్ విష్ణుజగతి వారి సమక్షంలో కోఆర్డినేటర్‌గా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వ జీత భత్యాలు లేకుండా కేవలం ప్రజలకు సేవ చేయాలని కొద్దిమంది సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హెల్త్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయ రంగుకు సేవ పురస్కారం ఇవ్వగా మంత్రి చేతుల మీదుగా క్రీడా సామాగ్రిని అందచేశారు. రాబోయే రోజులలో ప్రభుత్వ సహకారంతో మహిళలు, యువకులకు స్వయం ఉపాధి క్రింద కుట్టు మిషన్, బ్యూటిషన్, కంప్యూటర్ శిక్షణ ఇస్తామని విజయ రంగా తెలిపారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణుజగతి పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత పాటించాలి : దర్పల్లి


బాక్స్ డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** ఎస్ఎన్‌డిపి పనుల్లో నాణ్యతను పాటించాలని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గ్రీన్‌పార్క్ కాలనీలో జరుగుతున్న బాక్స్‌డ్రెయిన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాక్స్ డ్రెయిన్ మధ్యలోఉన్న త్రాగునీటి పైపులైన్‌ను తొలగించి పనులు చేపట్టాలని, భవిష్యత్తులో కలుషిత నీటి సమస్య రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ కృష్ణయ్య, కాలనీ అధ్యక్షుడు కమలేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, రామస్వామి, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు యూత్ కాంగ్రెస్ బాసట: బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి


రాష్ట్ర అధ్యక్షునికి సంఘీభావం తెలుపుతున్న రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న నిరుద్యోగులకు యువజన కాంగ్రెస్ బాసటగా నిలుస్తుందని మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో జరుగుతున్న అవకతవలపై ఆందోళన వ్యక్తంచేస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి చేపట్టిన సమర దీక్షకు శూరకర్ణారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దీక్షా శిబిరానికి తరలివెళ్ళి శివసేనారెడ్డికి పూలమాల వేసి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు యూత్ కాంగ్రెస్ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

## సరూర్‌నగర్ మండల టిఎస్‌యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**సరూర్‌నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) సరూర్ నగర్ మండల శాఖ అధ్యక్షునిగా ఆర్.తావూరి నాయక్, ఉపాధ్యక్షులుగా ఎం.జంగయ్య, సుజాత, ప్రధాన కార్యద ర్శిగా జి.మల్లేష్, కోశాధికారిగా పి.దినేష్‌కుమార్, కార్యద ర్శులుగా శంకరయ్య, ప్రతాప్‌రెడ్డి, కరుణ, అన్నపూర్ణ, సుజాత, విజయ్, ఇ.కేశవులు, డి.పాండు, మాధురి, జిల్లా ప్రతినిధులుగా కె.అరుజ్ఞన్‌రెడ్డి, బి.గణేష్‌కుమార్, జి.పాండు రంగారెడ్డి, ఎం.జంగయ్య, ఆర్.తౌరియా నాయక్, మల్లేష్, కాంప్లెక్స్ కమిటీలకు ఎల్.రాజు, బసవరాజు, చంద్రశేఖర్, మహిళా సబ్ కమిటీ కన్వీనర్‌గా అన్నపూర్ణ, సభ్యురాలిగా ఉమాదేవి, వాయిస్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్‌గా టి.సురేష్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

## పెద్దమ్మ ఆలయం కమిటి చైర్మన్‌గా అంబటి జగదీష్ ఎన్నిక


చిలుకానగర్ పెద్దమ్మ ఆలయం కమిటి చైర్మన్‌గా జగదీష్‌కు నియామక పత్రం అందజేస్తున్న గోనె అంజయ్య తదితరులు

**ఉప్పల్,డిసెంబరు 27 ప్రభాతవార్త :** చిలుకానగర్ శ్రీ పెద్దమ్మ తల్లి దేవస్థానం కమిటి చైర్మన్‌గా అంబటి జగదీష్ ముదిరాజ్ ఎన్నికైయ్యారు. ఈ మేరకు ఆలయ కమిటి నేతలు గోనె అంజయ్య, జిన్నా లక్ష్మినారాయణ, పాల్వంచ విఠల్, ఎద్దు బిక్షపతి, అంబటి యాదయ్య, ముక్కాల రామకృష్ణల నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంబటి జగదీష్ ముదిరాజ్ మాట్లాడుతూ చిలుకానగర్ శ్రీ పెద్దమ్మ ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు గుర్రాల బీమయ్య, కొంపల్లి రాజ్‌కుమార్, పిట్టల నరేష్, బాలేందర్, సుధాకర్, మహేందర్, శ్రీశైలం, నాగరాజు, తెలంగాణ సంపత్, నవీన్, సాయికుమార్, కృష్ణా, అంజయ్య, ప్రవీణ్, వినయ్, రమేష్, ప్రభాకర్, సత్యనారాయణ, స్వామి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో రూ.2.16కోట్లతో అభివృద్ధి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్లో మంగళవారం రూ.2.16కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి డివిజన్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. న్యూ మారుతినగర్ రూ.77లక్షల వ్యయంతో ఈస్ట్‌లో స్ట్రామ్ వాటర్ డ్రెన్, కమర్షియల్ టాక్స్ కాలనీలో రూ.55 లక్షల వ్యయంతో సి.సి.రోడ్డు, ప్రజయ్ నివాస్ ఫేస్2లో రూ.12లక్షల వ్యయంతో యూజీడి రీమోడలింగ్, న్యూనాగోల్‌కాలనీలో రూ.17 లక్షలతో నిర్మించే సి.సి.రోడ్డు, ఎస్.ఎల్.ఎం.ఎస్ హాస్పిటల్ న్యూ నాగోల్ కాలనీలో రూ.51 లక్షలతో సిసి రోడ్డు, స్నేహపురి కాలనీలో రూ.52 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీ.సీ.రోడ్డు రిస్టోరేషన్ పనులకు శంకుస్థాపన చేశామని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, నాయకులు లింగాల నాగేశ్వరరావు, ఆనంతుల రాజారెడ్డి,డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్, అనంతుల సురేందర్ రెడ్డి, విజయ గౌడ్, రింకుగౌర్, మహేష్ రెడ్డి, దీప్ లాల్, ఉదయ్, జోగు రాములు, శ్రీశైలం గౌడ్, జోగు నాగేష్, ఇటికల యాదగిరి, వరుణ్ చంద్ర, జంగిర్ బాబు గౌడ్, రూపాసింగ్, మాలతి పాల్గొన్నారు.

## రూ.30లక్షలతో సిసి రోడ్డు పనులు : ఎమ్మెల్యే బేతి


సాయిరాంకాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ సాయిరాంకాలనీలో రూ.30లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలనీలో వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి నీటినిల్వల తొలగింపునకు తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించినట్లు కార్పొరేటర్ రజిత తెలిపారు. అదేవిధంగా సాయిరాంకాలనీలో రూ.18లక్షలతో కాలనీవాసుల వినతిమేరకు ప్రత్యేకంగా ఒపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, జల మండలి జిఎం సంతోష్‌కుమార్, మేనేజర్ సత్యనారాయణ, బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, సంతోష్‌రెడ్డి, మస్క సుధాకర్, కాలనీ అధ్యక్షుడు తుమ్మల రాజేందర్‌రెడ్డి, వర్కల మదన్‌గౌడ్, దేవిరెడ్డి, యాదగిరిరెడ్డి, నరసింహారెడ్డి, కుంటల శ్రీనివాస్‌రెడ్డి, కెమిడి శ్రీను, పుసా సాయి, శ్వేత, రమాదేవి, లక్ష్మి, వర్కల మణెమ్మ, యాదయ్య, అల్లబాషా, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు


బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్ డిసెంబర్ 27 ప్రభాతవార్త:** పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్రగాయమై చికిత్స పొందుతున్న మౌలాలి డివిజన్ నెహ్రు నగర్‌కు చెందిన ఉమాకు రూ. 50వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి పత్రాన్ని ఆయన మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జివిఎన్ సతీష్ కుమార్, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, నాయకులు సైదులు, బాంజి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** హబ్సిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇ రాంరెడ్డి తెలిపారు. హబ్సిగూడ స్ట్రీట్‌నెం.8 ప్రధాన రహదారితోపాటు, గ్రీన్‌హిల్స్‌కాలనీ, జెఎస్‌నగర్, రవీంద్రనగర్, వసంత విహార్‌కాలనీ, జిజి కాలనీ, బృందావన్‌కాలనీ, లక్ష్మినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించడంతోపాటు,మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## బాలికపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

**హయత్‌నగర్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** నాలుగేళ్ల చిన్నారిపై దగ్గరి బంధువు లైంగిక దాడికి యత్నించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకార వివరాలు పెద్దఅంబర్‌పేటకు చెందిన బండారు మహేష్(22)కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన తన బంధువుల కుమార్తె(4)ను ఈనెల 22న తన సాయంత్రం 6 గంటలకు తనతో పాలు బైక్‌పై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి ఏడవడంతో ఎవరైనా వస్తారన్న బయంతో తిరిగి ఆమెను ఇంటి వద్ద వదిలివేశాడు. మామయ్య తనను బయటకు తీసుకువెళ్లి దుస్తులు తీసాడని చిన్నారి బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అతన్ని నిలదీశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 28న కొత్తపేటలో క్యాబ్ డ్రైవర్ల ఆవేదన సభ

**ఉప్పల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** కొత్తపేటలోని జగ్జీవన్ రామ్ ఆడిటోరియంలో ఈనెల 28న క్యాబ్ డ్రైవర్ల ఆవేదన సభ నిర్వహిస్తున్నట్లు క్యాబ్ డ్రైవర్ల జెఎసి నేతలు టి.రాజశేఖర్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించతలపెట్టిన ఆవేదన సభ పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో క్యాబ్ డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇతర రాష్ట్రాల వాహనాలు కట్టడి చేయాలని, పెరిగిన జీవనశైలికి అనుగుణంగా ధరల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న వాహనాల అద్దెలు పెంచాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, ట్యాక్సీ వాహనాలకు నగరంలో ఉచితంగా పార్కింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. క్యాబ్ డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులు, వారి సమస్యలు తెలుసుకునేందుకు భారీ ఎత్తున ఆవేదన సభ నిర్వహిస్తున్నామని, వివిధ ప్రాంతాల నుంచి క్యాబ్ డ్రైవర్లు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని తెలిపారు. క్యాబ్ డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు జెఎసి నేతలు పాల్గొన్నారు.

## బీరప్పగడ్డలో ఘనంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ


ఉప్పల్ బీరప్పగడ్డలో జరిగిన అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్ బీరప్పగడ్డలోని శ్రీ విజయదుర్గ ఉప్పలమ్మ దేవాలయంలో మంగళవారం అయ్యప్పస్వామి 15వ మండల పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పూజల మహేష్‌బాబు, కోట్ల శంకర్, ఆలయ అర్చకులు పరిపూర్ణశాస్త్రి, అయ్యప్ప స్వాములు పూజల రాఘవ, పూజల రంజిత్, వేణుగోపాలశర్మ, అంద్రాజుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి వేడుకలు అంగరంగ నిర్వహించడం అభినందనీయమన్నారు. అయ్యప్ప భక్తులకు తగు చేయూత అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని అంబారీపై ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు వి.సంతోష్‌రెడ్డి, మస్క సుధాకర్, చిలుగూరి శ్రీకాంత్, పిట్టల నరేష్, రాజు, యాదగిరిరెడ్డి, వంశీ, వెంకట్‌రెడ్డి, ఇర్ఫాన్‌ఖాన్, ఐలేష్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జైపురి కాలనీ అభివృద్ధికి సహకరించండి : యాదగిరి


డిసి మారుతి దివాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదగిరి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త :** జైపురికాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని జయపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి విజ్ఞప్తి చేశారు. జైపూర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హయత్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్ మారుతి దివాకర్‌ని కలిసి జైపూరి కాలనీలో పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ పార్క్ ఏర్పాటు చేయాలని మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని అతి త్వరలోనే కాలనీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రాహుల్ పోతని, సెక్రెటరీ కస్తూరి అశోక్, జంగాల శివకుమార్ యాదవ్, ట్రెజరర్ నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు కంటిచూపు అందించడమే నా సంకల్పం : నందికంటి శ్రీధర్


ఉచిత కంటి వైద్య శిబిరంలో నందికంటి శ్రీధర్ తదితరులు

**నేరెడ్‌మెట్ డిసెంబర్ 27 ప్రభాతవార్త:** పేద ప్రజలకు కంటి చూపు అందించడం కోసం తనవంతు సహాయం చేస్తానని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని బిజెఆర్‌నగర్ పోచమ్మగుడివద్ద నందికంటి శ్రీధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటిచూపు సరిలేనివారు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి చికిత్సతో పాటు ఉచితంగా కంటి అద్దాలను సైతం పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమేష్ సింగ్, అంతోని, సూర్య ప్రకాష్, శ్యామరావు, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గుత్తి రామ్‌చందర్, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.